పర్యావరణాన్ని పరిరక్షించండి

మున్సిపల్ వైస్ చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందిచాలంటే పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే కూడలిలలో మానవహారంగా ఏర్పడి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంతో మనిషి జీవితం ముడిపడిందన్నారు. ప్రకృతిని ఇష్టానుసారంగా కొందరూ నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ ఎం.గోపాలరావు మాట్లాడుతూ పర్యావరణ హిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పంట కాల్వలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో 35వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గొడవర్తి శ్రీసాయి హరేరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, గుమ్మడి ప్రసాద్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వి.మాధవ రావు, శానిటరీ సెక్రటరీలు, నగర దీపికలు, ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

తెనాలిరూరల్ :పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. న్యాయమూర్తి మాట్లాడుతూ భావితరాలకు ఆరోగ్యకర వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని రక్షించుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.చంద్రశేఖర్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది షేక్ హబూబ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

తెనాలి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో మొక్కలు నాటారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వైస్ చైర్మన్ హరిప్రసాద్, ఏసీ గోపాలరావు

విద్యార్థినికి రూ.10,116ల ఆర్థిక సాయం

తెనాలి: ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపులో 952 మార్కులతో ఉత్తీర్ణురాలైన కోపల్లెకు చెందిన సంజన అనే విద్యార్థినికి ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజైన సోమవారం 'అవర్ స్టేట్ అవర్ లీడర్ అండ్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం', చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ కారుమంచి రవికుమార్ రూ.5,000, జాల ప్రసాద్ రూ.5,116 చొప్పున మొత్తం రూ.10,116లను బహూకరించారు. క్లబ్, ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి, చింతల బోబు రాజు, కనపర్తి సతీష్, ఎంపీటీసీ కిశోర్‌బాబు పాల్గొన్నారు.


విద్యార్థిని సంజనకు నగదు అందజేత

బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణకు ప్రతిజ్ఞ

తెనాలిటౌన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొలకలూరు గ్రామంలో సోమవారం తెనాలి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని, మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యకర్తలు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, టి.వరలక్ష్మి, సరోజిని, దుర్గా, శివనాగమల్లీశ్వరి, హేమలత, త్రిపుర, రాహేలు, మంజుల, హైమావతి, కుమారి, అనితారాణి, సరళ, డీఆర్‌డీఏ వీవోఏలు సత్యవతి, అరుణ, గీత, బేబి, నవీన పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ దినోత్సవ పోటీలు

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శాఖ గ్రంథాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరంలోని విద్యార్థులకు పర్యావరణం-పరిరక్షణ అనే అంశంపై వక్తృత్వం, నినాదాలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభ్యుడు అహ్మద్‌హుస్సేన్, పల్నాడు జిల్లా కార్యదర్శి ఫిరోజ్, అత్తోట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపాటి శివనాగేశ్వరరావు, సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పర్యావరణానికి నష్టం కలుగచేసే చర్యల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గ్రంథాలయాధికారి కావూరి రమాదేవి, రికార్డ్ అసిస్టెంట్ లావణ్య సుధ పర్యవేక్షించారు.


మొక్కను నాటుతున్న న్యాయమూర్తి శ్రీసీత


మొక్క నాటుతున్న ప్రిన్సిపల్, విద్యార్థులు


విజేతలతో నిర్వాహకులు

మున్సిపల్ రెవెన్యూ అధికారిగా సోమశేఖర్ యాదవ్ బాధ్యతలు



తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ రెవెన్యూ అధికారిగా డి.సోమశేఖర్ యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన భీమవరం మున్సిపల్ కార్యాలయం నుంచి తెనాలి బదిలీపై వచ్చారు. ఆయన గతంలో టైపిస్ట్‌గా, సీనియర్ అసిస్టెంట్‌గా, ఇన్‌చార్జి ఆర్వోగా కొద్దికాలం తెనాలిలో పనిచేశారు. తెనాలిలో ఆర్వోగా పనిచేస్తున్న విల్సన్ జయకర్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు.

ఏపీ జేఏసీ సదస్సును విజయవంతం చేయాలి



తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న తలపెట్టిన 4వ ప్రాంతీయ సదస్సులో అందరూ పాల్గొని, జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం ప్రాంతీయ సదస్సు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. తహసీల్దారు కె.రవిబాబు, ఎంపీడీవో విజయలక్ష్మీ, సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ కలిసికట్టుగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. పెండింగ్ డీఏ, పీఆర్సీ, అరియర్స్ సమస్యల పరిష్కారం కోసం తలపెట్టిన ప్రాంతీయ సదస్సులో అందరూ పాల్గొని, ఐక్యత చాటాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



వల్లభాపురం(కొల్లిపర): వల్లభాపురం గ్రామంలో సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వల్లభాపురం నిర్మల, ఉప సర్పంచ్ అవుతు పోతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న బొంతు శ్రీనివాస్‌రెడ్డి పొలంలో నవ ధాన్యాలు, 15 రకాల పీఎండీఎస్ పచ్చి రొట్ట విత్తనాలు నాటారు. సర్పంచ్ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలు పొలంలో వేయటం వల్ల భూమికి సేంద్రియ ఎరువు అందుతుందన్నారు. తొలుత రైతులు పొలంలో గంగమ్మకు, గోమాతకు, వృషభాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి వెంకటరమణ, ఎల్2 రాంబాబు, ఎంటీ నాగకృష్ణ, రవి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: కంకిపాటి భార్గవి జన్మదినాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులో సోమవారం ఆమె కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హరిషితా మెడికల్స్ నిర్వాహకులు కంకిపాటి రమేష్, శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి అధ్యక్షులు కుర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసంపై ఫిర్యాదు

తెనాలిరూరల్: స్థానిక మోరిస్‌పేట పరిధిలోని చంద్రబాబునాయుడు కాలనీ, ఆర్‌ఆర్ నగర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆర్‌ఆర్ నగర్ కాలనీకి చెందిన నసీమా తమ చిట్టీల డబ్బులు తీసుకుని మోసం చేసిందని బాధిత మహిళలు వాపోయారు. తమతో పాటు అనేక మంది మహిళలకు ఆమె నగదు ఇవ్వాలని, తమకే రూ. 20 లక్షల వరకు నగదు రావాల్సి ఉందని తెలిపారు. చిట్టీల డబ్బులు అడిగిన ప్రతిసారీ వాయిదాలు వేస్తూ వచ్చి, ఇప్పుడు ఎవరికీ చెప్పకుండా సామాన్లతో సహా ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయిందని వాపోయారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టినట్లు వెల్లడించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్టు ఉద్యోగి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, బంధువులు తెనాలిలో సోమవారం రాస్తారోకో చేపట్టారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం మండూరుకు చెందిన రాజేష్(40) తెనాలి పురపాలక సంఘంలో కాంట్రాక్టు వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. అమృతలూరు మండలం మోపర్రు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు తెనాలి చెంచుపేట ఆర్‌సీఎం చర్చ్ వద్ద తెనాలి-గుంటూరు రహదారిపై రాస్తారోకో చేశారు. రాజేష్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి, కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వచ్చి, ఆందోళన చేస్తున్న వారికి సర్ది చెప్పారు. రాస్తారోకో కారణంగా ఎద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి.

ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం



మంగళగిరి: ఆటో డ్రైవర్ సమయస్ఫూర్తితో ప్రమాదం తప్పిన ఘటన సోమవారం నగరంలోని ఎయిమ్స్ ఆసుపత్రి రోడ్డులో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. మంగళగిరి నుంచి రోగులను, వారి బంధువులను ఆటోలో ఎక్కించుకున్న డ్రైవర్ ఎయిమ్స్ ఆసుపత్రికి బయలు దేరాడు. మార్గ మధ్యలోని ఏకోపార్క్ ప్రవేశ ద్వారం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఆటో వెనుక చక్రం ఊడిపోయింది. ఆటో ఓ పక్కకు ఒరిగిపోయి కొద్ది దూరం దూసుకుపోయింది. ఆటోలో ఉన్న రోగులు, వారి బంధువులు ఆందోళన చెందారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి ఆటోను నిలిపివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం వారు తిరిగి వేరే ఆటోలో ఎక్కి ఎయిమ్స్ ఆసుపత్రికి వెళ్లారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెనుమాకలో చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే ఆర్థిక సహాయంతో వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం రాత్రి వైఎస్సార్ సెంటర్‌లో తోపుడు బండ్లు, రిక్షా బండి అందజేశారు. పెనుమాకకు చెందిన పఠాన్ నాగుల్‌మీరాకు రిక్షాబండి, దాసరి కోటేశ్వరరావు, నెమలికంటి సూరికి తోపుడు బండ్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ దామేష్‌రెడ్డి, భవనం రవీంద్రారెడ్డి, మేకా అంజిరెడ్డి, బొక్కా ప్రసన్న కుమార్(నాని), ఎస్కే బషీర్, మురళి పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన సుగాలీ విద్యార్థులకు పురస్కారాలు

తెనాలి: వేమూరు, కొల్లూరు, తెనాలి, దుగ్గిరాల మండలాల పరిధిలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన సుగాలీ విద్యార్థినీ విద్యార్థులకు స్థానిక చినరావూరు తోలిజయాడి భవాని ఆలయం వద్ద జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివి, అత్యధిక మార్కులు సాధించినవారికి నగదు బహుమతులు, ఇతర విద్యార్థులకు జ్ఞాపికలను ప్రదానం చేసి, వారి తల్లిదండ్రులను సత్కరించారు. తిరువూరు సివిల్ జడ్జి కేతావత్ మోతీలాల్, బాపట్ల జిల్లా తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ బాణావత్ రాందాస్ నాయక్, నూతక్కి ప్రభుత్వ పాఠశాల పీఈటీ కేతావత్ రజనీనాయక్, డాక్టర్ కేతావత్ చందులాల్ నాయక్, కోర్రా కపూర్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జై సేవాలాల్ లంబాడ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు ధారవత్ ప్రసాద్ నాయక్, ఉపాధ్యక్షుడు ఇస్లావత్ కృష్ణనాయక్, కోశాధికారి కేతావత్ లక్ష్మణ్ నాయక్, కార్యదర్శి పొత్లావత్ రాములు నాయక్, సహాయ కార్యదర్శి అజ్మీరా బాలకృష్ణనాయక్, కోర్రా లక్ష్మణ్‌నాయక్, తండా నాయిక కేతావత్ పరశురామ్ నాయక్, సుగాలీ యూత్ పర్యవేక్షించారు.


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

అతిసారం నియంత్రణ పక్షోత్సవాలు ప్రారంభం


అతిసారం నివారణ పక్షోత్సవాల గోడ ప్రతుల ఆవిష్కరణ


అతిసారం గురించి వివరిస్తున్న డాక్టర్ సుబ్బారావు

తెనాలిటౌన్: కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 17వరకు అతిసారం నియంత్రణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుబ్బారావు తెలిపారు. పీహెచ్‌సీలో సోమవారం రోగులకు అతిసారం పై అవగాహన కల్పించారు. అతిసారం నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్సను వివరించారు. గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ దిలీప్, సూపర్‌వైజర్‌లు వెంకటరెడ్డి, లక్ష్మీ ప్రసన్న, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతే..అతిసార నివారణ

కొల్లిపర: అతిసార వ్యాధి భారినపడకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, శుద్ధి చేసిన మంచి నీటిని తాగాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అతిసార నివారణ పక్షోత్సవాలను సర్పంచ్ పిల్లి రాధిక, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీవో పి.శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో 5 నుంచి 17వ తేదీ వరకు అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరికైన విరోచనాలు , డీ-హైడ్రేషన్ లక్షణాలు ఉంటే.. ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి ఉచితంగా జింక్ ఓఆర్ఎస్ పొందవచ్చని వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతి పవార్
- అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలతో భేటీ

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సహాయ మంత్రి భారతి పవార్ కోరారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. దుగ్గిరాల సీసీఎల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే మురుగు నీటి వల్ల తాగునీరు కలుషితం అవుతోందని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీటీసీ-2 సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్ కేంద్ర సహాయ మంత్రికి వినతిపత్రం అందజేశారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సదుపాయాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు సంబంధించిన పరికరాలు సమకూర్చాలని పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ దిలీప్ వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి భారతి పరివార్ మాట్లాడుతూ కోవిడ్ సమయంలో వైద్యులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. తొలుత అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో సహాయమంత్రి భారతి పవార్ ఫొటోలు దిగారు. పార్టీ రాష్ట్ర మహిళామోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిషోర్, నాయకులు పాతూరి నాగభూషణం, పాటిబండ్ల రామకృష్ణలు మాట్లాడారు. తొలుతగా పార్టీ నాయకులు తోటకూర కోటేశ్వరరావు స్వాగతం పలికారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కె.యోగానంద కిషోర్, కాలిశెట్టి భావన్నారాయణ, అత్తలూరి బ్రహ్మయ్యయ, పాకాల సత్యనారాయణ, అన్నవరపు వేణు, మైలా హరికృష్ణ, బిట్రా కనక దుర్గ, తాళ్ళూరి బుల్లెబ్బాయి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి భారతిపవార్

రాష్ట్రంలో సుభిక్ష పాలన

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సుభిక్ష పాలన అందిస్తోందని, అన్ని వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో సోమవారం రాత్రి 8వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. మహిళలు హారతులు ఇచ్చి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి, మాజీ మంత్రి దివంగత అన్నాబత్తుని సత్యనారాయణ గుడివాడ కోపల్లె రోడ్డు వేయిస్తే, తాను ఎమ్మెల్యేగా గ్రామంలో 30 ఏళ్లుగా ఆదరణకు నోచుకోని ప్రధాన సెంటరు నుంచి రైల్వే గేటు వరకు సిమెంట్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. దీనిపై స్థానికులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలోని చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తానని, పట్టణ మురుగు గ్రామం నుంచి వెళ్తుండటంతో.. కాల్వ పూడిక తీయించనున్నట్టు చెప్పారు. గ్రామంలో రూ. 21 కోట్ల సంక్షేమ పథకాలు గ్రామస్తులకు నాలుగేళ్లలో ప్రభుత్వం అందిచిందని వివరించారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎంపీటీసీలు ముప్పవరపు సంధ్యారాణి, పేరం అరుణ, పంచాయతీ కార్యదర్శి గుర్రం ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నేతలు కావూరు కిషోర్, జగన్‌మోహనరావు, చుండూరు గోపీ, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.


ఎమ్మెల్యే శివకుమార్‌కు హారతి ఇస్తున్న మహిళ

గణేషుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేషునిపాడు గ్రామంలో వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. ఇటీవల గణేషునిపాడు గ్రామ శివారులో కొండపై కొండవీటి రెడ్డిరాజుల కాలం నాటి ఆస్థాన విద్వాంసుడు శ్రీనిధునిచే పూజించబడిన గణేశుని విగ్రహాన్ని గుర్తుతెలియని దుండుగుల చేత ధ్వంసం కావడంతో అదే ప్రదేశంలో కొత్తపాలెం, గణేషునిపాడు గ్రామస్తుల సహకారంతో నూతనంగా గణేషుని విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. మూడురోజులపాటు ప్రతిష్ఠ కార్యక్రమ పూజలు నిర్వహించనున్నారు. ఉదయాన్నే యాగశాలలో వేదపండితులు పలు రకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం యంత్రపూజలు నిర్వహించి నీరాజనం, మంత్రపుష్పం అందజేశారు. కార్యక్రమాలను వేద పండితులు నారాయణప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు పర్యవేక్షించారు.

16న నగరేశ్వరస్వామికి అభిషేకాలు

తెనాలి: పట్టణంలోని బోసు రోడ్డులో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో పంచాక్షరి మంత్ర జప దీక్ష పారాయణ మహాయజ్ఞంలో భాగంగా ఈ నెల 16న మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, సహస్రలింగార్చన వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ పాలకవర్గం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల బ్రోచర్‌ను సోమవారం కార్యదర్శి బూర్లె నరసింహరావు, వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మద్దాళి శేషాచలం , అత్తలూరి నరసింహరావు, అన్నవరపు నరసింహరావు ఆవిష్కరించారు. ప్రతిరోజూ 108 పర్యాయాలు 'ఓం నమఃశ్శివాయ' అనే పంచాక్షరి మంత్రాన్ని గుప్పెడు బియ్యం చేతపట్టుకుని మంత్ర జపం చేయాలని వరదరాజులు కోరారు. ప్రతిరోజూ మంత్ర జపం చేసిన బియ్యాన్ని 16న దేవస్థానంలో శ్రీ వింధ్యవాసినీ సమేత నగరేశ్వరస్వామికి జరిగే అన్నాభిషేకంలో స్వయం పాకంగా సమర్పించాలని వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ కోరారు. పరమశివుని కృపకు పాత్రులు కావాలని కోరారు.


బ్రోచర్‌ను ఆవిష్కరించిన నరసింహరావు, హరిప్రసాద్, వరదరాజులు ప్రభృతులు

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ట్రోఫీ గెల్చుకున్న బాప్టిస్ట్ వారియర్స్ జట్టు

మంగళగిరి: నగరంలోని బాప్టిస్టుపేటలో ఆరు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం రాత్రి ముగిసింది. బాప్టిస్ట్ యూత్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాప్టిస్ట్ యూత్ స్థానిక దాతల సహకారంతో టోర్నమెంట్ నిర్వహించగా ఆరు జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌కు బాప్టిస్ట్ వారియర్స్ జట్టు, బాప్టిస్ట్ రాయల్స్ జట్టు చేరుకోగా ఆదివారం ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాయల్స్ జట్టు 5 వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వారియర్స్ జట్టు 4 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. అతిథులు వారియర్స్ జట్టుకు ట్రోఫీ అందజేసి టోర్నమెంట్ పోటీల్లో పాల్గొన్న జట్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


ట్రోఫీతో బాప్టిస్ట్ వారియర్స్ జట్టు

జగనన్న విద్యా దీవెన కిట్లు పాఠశాలలకు పంపిణీ



తాడేపల్లిరూరల్: జగనన్న విద్యా దీవెన కింద అందజేసే కిట్లను సోమవారం మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. దుగ్గిరాల బాయిస్ హాస్టల్‌లో ఉన్న స్టాక్ పాయింట్ నుంచి వివిధ పాఠశాలలకు తరలించారు. ఎంఈఓ కాజా శ్రీనివాసరావు మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, నోటు, పాఠ్య పుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశామని అన్నారు. మరో రెండు రోజుల్లో బూట్లు, బెల్టులు కూడా వస్తాయని వాటిని కూడా ఈనెల 12వ తేదీ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.